Postal License No.VJ/220/2023-25

నేటి పత్రిక ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వార పత్రిక

TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL
Prajavatha-Online Telugu News
http://www.prajavartha.com
వీక్షించండి .. చదవండి... చెప్పండి...

విజయవాడ | తేదీ : 16-23 ఏప్రిల్ 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 04 | సంచిక : 45 | పేజీలు : 4 | రూ. 5.00

అమరావతికి మోదీ.. లక్ష కోట్ల పనులకు మే 2న ప్రారంభోత్సవం!

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా శ్రీకారం చుట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మే 2వ తేదీన ప్రధాని అమరావతిలో పర్యటించి, సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారని మంత్రుల కమిటీ వెల్లడించింది. ప్రధాని పర్యటన విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లపై కమిటీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై చర్చించేందుకు మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్ లతో కూడిన కమిటీ విజయవాడలోని జలవనరుల శాఖ క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఆర్డీఏ అధికారులు, వివిధ శాఖల కార్యదర్శులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో కూడిన నిర్వహణ కమిటీ సభ్యులు, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. మే 2న ప్రధాని కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఏర్పాట్ల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కమిటీ అధికారులను ఆదేశించింది. ప్రధాని పర్యటన సందర్భంగా అమరావతిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సుమారు 5 లక్షల మంది ప్రజలు హాజరవుతారని మంత్రుల కమిటీ అంచనా వేస్తోంది. అందుకు అనుగుణంగా సభా ప్రాంగణం, హెలిప్యాడ్ల నిర్మాణం, సభకు చేరుకునే రహదారుల అభివృద్ధి, పార్కింగ్ సౌకర్యాలు, వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలను కల్పించడంపై మంత్రులు అధికారులతో చర్చించారు. జన సమీకరణ, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని అమరావతికి చేరుకుంటారని, సాయంత్రం 5:20 వరకు కార్యక్రమాల్లో పాల్గొంటారని మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్ తెలిపారు. అమరావతి పునర్నిర్మాణ వేదిక నుంచే ప్రధాని మోదీ లక్ష కోట్ల రూపాయల విలువైన పనులకు ప్రారంభోత్సవం లేదా శంకుస్థాపన చేస్తారని మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. ఈ పనులన్నింటికీ ఇప్పటికే ఆర్థిక వనరులు సమకూరాయని, కాంట్రాక్టర్లను కూడా ఖరారు చేశారని ఆయన తెలిపారు. "ప్రధానమంత్రి గారు పనులను ప్రారంభించిన మరుసటి రోజు నుంచే క్షేత్రస్థాయిలో పనులు మొదలయ్యేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం" అని పయ్యావుల కేశవ్ వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రాజధాని కోసం భూములిచ్చిన రైతులు, మహిళలు అనేక ఇబ్బందులు పడ్డారని, వారికి గౌరవం కల్పించే వేదికగా కూడా ఈ కార్యక్రమం నిలవాలని ఆశిస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. అన్ని జిల్లాల నుంచి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సమన్వయంతో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ ఈ చారిత్రక ఘట్టంలో పాలుపంచుకోవాలని మంత్రి పయ్యావుల కేశవ్ ఆహ్వానించారు. ప్రధాని పర్యటనతో అమరావతి అభివృద్ధి పనులు తిరిగి ఊపందుకుంటాయని మంత్రులు ధీమా వ్యక్తం చేశారు.

కేంద్ర గిరిజన వర్సిటీ నిర్మాణ పూర్తికి సహకారం : సీఎం చంద్రబాబు



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : విజయనగరం జిల్లా మెంటాడ మండలం కుంటినవలసలో నిర్మాణమవుతోన్న కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం సత్వర పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా సహకరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయ వీసి ప్రొఫెసర్ టీ.వీ. కట్టిమణి, డీన్ ప్రొఫెసర్ ఎం.శరత్ సీఎం చంద్రబాబును మంగళవారం సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీ నిర్మాణ పనులు, అక్కడి స్థితిగతులపై వారితో సీఎం చంద్రబాబు మాట్లాడారు. గిరిజన వర్సిటీ నిర్మాణానికి కేంద్రం రూ.800 కోట్లు కేటాయించగా, వాటిలో రూ.340 కోట్లు ఇప్పటికే విడుదల అయ్యాయి. మొత్తం 561 ఎకరాల వర్సిటీ ప్రాంగణంలో అడ్మిన్ బిల్డింగ్‌తో పాటు వసతి భవనాలు, అకడమిక్ బ్లాక్స్ నిర్మిస్తున్నారు. ఈ పనులు వేగవంతం చేయాలని వీసికి సీఎం సూచించారు. ఏడాదిలోగా అన్ని నిర్మాణాలు పూర్తి చేసి....భవనాలను అందుబాటులోకి తేవాలని అన్నారు. నిర్మాణాల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వ పరంగా పూర్తిగా సహకరిస్తామని సీఎం చెప్పారు. వర్సిటీకి అవసరమైన తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, అప్రోచ్ రోడ్ వంటి పనులను త్వరితగతిన పూర్తిచేస్తామని సీఎం హామీ ఇచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సత్వరం కార్యాచరణ చేపట్టాలని సమావేశంలోనే సంబంధిత అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. వర్సిటీకి రెండు కి.మీ మేర అప్రోచ్ రోడ్ పనులు పూర్తి చేస్తే తమకు సౌకర్యవంతంగా ఉంటుందని వీసి చెప్పగా...ఆ పనులు వెంటనే ప్రారంభిస్తామని సీఎం అన్నారు. 100 మంది టీచింగ్ స్టాఫ్ అవసరం ఉండగా...ప్రస్తుతం కేవలం 18 మంది మాత్రమే ఉన్నారని వర్సిటి అధికారులు తెలిపారు. సిబ్బందిని మరింత పెంచాల్సిందిగా కోరుతూ ప్రధానికి లేఖ రాస్తానని సీఎం తెలిపారు. మే నెలలో నిర్వహించే యూనివర్సిటీ స్నాతకోత్సవానికి రావాల్సిందిగా రాష్ట్రం నుంచి కూడా కోరుతూ ప్రధానికి లేఖ రాస్తామని వర్సిటీ అధికారులతో సీఎం చంద్రబాబు అన్నారు. 2018లో నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కాగా అప్పటి నుంచి అద్దె భవనాల్లో క్లాసులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం వర్సిటీని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల పనులు జరగలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వర్సిటీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టిపెట్టింది. ప్రస్తుతం ఈ యూనివర్సిటీలో 600 మంది విద్యార్థులు వివిధ కోర్సులను అభ్యసిస్తున్నారు. సొంత భవనాలు పూర్తి అయితే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని....నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. కొలువులు సాధన, నైపుణ్యం పెంచేలా బోధన ఉండేలా చూడాలని సీఎం వర్సిటీ అధికారులను కోరారు. ప్రస్తుత పరిశ్రమ, సమాజ అవసరాలకు అనుగుణంగా కోర్సులను అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

నాటక రంగానికి పూర్వ వైభవం తీసుకువస్తాం...

కందుల దుర్గేష్, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు.

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నాటక రంగానికి కూటమి ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకువస్తామని, కవులు, కళాకారులను ప్రోత్సహించి వారిలో ప్రతిభకు సానపెట్టడమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టీ.వి. మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు గారి 177వ జయంతిని పురస్కరించుకుని తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి మరియు జిల్లా స్థాయి కందుకూరి పురస్కారాలను నాటకరంగ లబ్ధప్రతిష్ఠులకు అందచేశారు. ముందుగా ముఖ్య అతిథులు కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్ మాట్లాడుతూ నాటకరంగ కళాకారులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ ఏడాది నుండి కూటమి ప్రభుత్వం నంది అవార్డులు, నంది నాటకోత్సవాలను పున:ప్రారంభించనున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గత ఐదేళ్లలో కళారంగంను అధోపాతాళానికి పడిపోయిందన, కవులు, కళాకారులను పట్టించుకున్న వారే లేరని విమర్శించారు. ఎక్కడైతే కవులు, కళాకారులు సంతోషంగా ఉంటారో ఆ రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. శ్రీకృష్ణదేవరాయల సభలో అష్టదిగ్గజాలకు స్థానం కల్పించడంతో పాటు కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి వారిని సముచితంగా సత్కరించేవారని, అందుకే రాయల వారి పాలన గురించి నేటికీ చెప్పుకుంటున్నామని గుర్తుచేశారు. నేటి యువత ఓటీటీలపై మొగ్గు చూపుతున్నారని, కాని అసలైన ఆనందం పద్య, గద్య నాటకాల్లో ఉందన్న విషయం మనం వారికి అవగతమయ్యేటట్లు చెప్పగలిగితే ఫలితం ఉంటుందని, యువత నాటక రంగంపై ఆసక్తి కలిగేవిధంగా సాంఘిక, ఆధునిక నాటకాలకు పెద్దపీట వేయాలని మంత్రి దుర్గేష్ అన్నారు. ప్రభుత్వం కళలు, కళాకారులను ప్రోత్సహిస్తుందని, దీనిలో భాగంగా ఇప్పటికే ఉగాది పురస్కారాలను అందించామని తెలిపారు. గత ప్రభుత్వం కళాకారులను ప్రోత్సహించే ఏ ఒక్క కార్యక్రమం చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాకారులను గౌరవించే సంస్కారం కూటమి ప్రభుత్వానికి ఉందని, ఇకపై ప్రతి ఏడాది కళాకారులను ప్రోత్సహించి నాటక రంగానికి మళ్లీ జీవం పోస్తామని అన్నారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ, రాష్ట్ర చలనచిత్ర, టీవీ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరక్టర్ హిమాన్షు శుక్లా, ఐఏఎస్., మాట్లాడుతూ మొక్కలకు వేర్లు ఎంత ప్రాధాన్యమో అంతే ప్రాధాన్యత నాటకరంగానికి ఉందని, ఆ రంగాన్ని బ్రతికించుకున్నప్పుడే కళలు పరిడవిల్లుతాయని అన్నారు. నాటకరంగానికి దశ, దిశ నిర్దేశం చేసిన మొట్టమొదటి వ్యక్తి శ్రీ కందుకూరి వీరేశలింగం అని తెలిపారు. ప్రతి ఏటా కందుకూరి వీరేశలింగం పంతులు గారి జయంతిని పురస్కరించుకుని తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించి ఆ మేరకు ఈ ఏడాది తెలుగు నాటకరంగ దినోత్సవంను జరుపుకుంటున్నామని తెలిపారు.

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో గ్రామీణాంధ్రప్రదేశ్ పాత్ర కీలకం

'గ్రామీణ ఆంధ్రప్రదేశ్ బలోపేతం దేశానికి అవసరం. వికసిత్ భారత్ అనే మహా లక్ష్యంలో గ్రామీణాంధ్ర ప్రదేశ్ కీలకం. పంచాయతీల స్వయం ప్రతిపత్తి సాధన లక్ష్యంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముందుకు వెళ్తోంద'ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు పవన్ కళ్యాణ్ గారు స్పష్టం చేశారు. గ్రామాల సమగ్రాభివృద్ధి ద్వారా గ్రామాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం, వలసలు అరికట్టడం, ఆహార భద్రత వంటి లక్ష్యాల సాధన సాధ్యపడుతుందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతంలో ఆర్థిక సంఘం సహకారం ఎంతో అవసరమని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థను పర్యావరణహితంగా, ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఆర్థిక సంఘం సహాయ సహకారాలతో పని చేస్తామన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు తామంతా కంకణబద్ధులై ఉన్నట్టు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య సాధనకు 16వ ఆర్థిక సంఘం పూర్తి స్థాయిలో సహకరిస్తుందనే ఆకాంక్షను వెలిబుచ్చారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో 16వ ఆర్థిక సంఘం సభ్యులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ డా.అరవింద్ పనగరియా, ఇతర సభ్యులతో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ పక్షాన తొమ్మిది అంశాలతో కూడిన ప్రతిపాదనలను ఆర్థిక సంఘం ముందుకు ఉంచారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ..మహాత్మా గాంధీ చెప్పినట్టు భారత దేశ భవిష్యత్తుకు పల్లెలే పట్టుగొమ్మలు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో గ్రామాలు కీలక పాత్ర పోషిస్తాయన్న నమ్మకం మాకు ఉంది. వికసిత్ భారత్ లో గ్రామాలకు సమాన పాత్ర ఉండాలి. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసికట్టుగా పని చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటోంది. ఉమ్మడిగా పని చేయడం బరువు కాదు బాధ్యతగా భావిస్తోంది. ప్రతి గ్రామాన్ని డిజిటల్ పంచాయతీగా అభివృద్ధి చేసే లక్ష్యంతో వేగవంతమైన ఇంటర్నెట్ సదుపాయం ఏర్పాటు చేయనున్నాం. దీంతోపాటు వ్యవసాయం, మార్కెట్, రోడ్లు, గ్రామీణ పంపిణీ హబ్ ల ఏర్పాటు, గుంతలు లేని రహదారుల నిర్మాణం ధ్యేయంగా పెట్టుకున్నాము. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఏకీకృత సేవల విధానం సిబ్బంది నియామకాలతోపాటు నైపుణ్య సామర్థ్యాల పెంపుదల, క్షేత్ర స్థాయిలో నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు వీలుగా సమూల మార్పులు తీసుకురావడం జరిగింది. ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించడం ద్వారా విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాము. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టబోయే పనుల్లో ప్రజల్ని భాగస్వాములుగా చేయడంతో పాటు ఓ పారదర్శక విధానానికి నాంది పలికాము.

గ్రామాల్లో జాతీయ భావం పెంపొందించేందుకు చర్యలు.. పంచాయతీల్లో జాతీయ భావాన్ని పెంపొందించే క్రమంలో గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ, గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకునేందుకు వీలుగా నిర్వహణ వ్యయాన్ని రూ. 100 నుంచి రూ. 10 వేలకు, రూ. 250 నుంచి రూ.25 వేలకు పెంచడం ద్వారా జాతీయ వేడుకలు ఘనంగా నిర్వహించుకునే ఏర్పాటు చేశాము. పంచాయతీల్లో జాతీయ భావం పెంపొందేలా చర్యలు చేపట్టాము. గ్రామాల్లో కలప మొక్కల పెంపకం, ఎకో టూరిజం అభివృద్ధి, సినిమా రంగం, మీడియా వ్యవస్థల నిర్వహణ అనువైన పరిస్థితులు తీసుకురావడం, ఇతర స్థానిక ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపర్చడం ద్వారా ఆర్థిక వృద్ధికి అవకాశాలు కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాము. స్థానికంగా ఉన్న ప్రతికూలతలను అవకాశాలుగా మలచుకునేలా మెరుగైన విధానాలను అమలు చేస్తున్నాము. ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో గో సంరక్షణ నిమిత్తం గోకులాల నిర్మాణం, హార్టీకల్చర్ కు ప్రోత్సాహకాలు అందించడం, గిరిజన మరియు పీవీటీజీ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాము. పంచాయతీలే దేశ నిర్మాణానికి పునాదులు అని నమ్ముతున్నాము. జాతీయ వృద్ధిలో పంచాయతీల పాత్ర కీలకం. ఇబ్బందులు ఉన్నప్పటికీ 2024 – 2025 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 800 కోట్ల ఇంటి పన్నును వసూలు చేశాము. పంచాయతీరాజ్ ఇనిస్టిట్యూషన్స్ విస్తరణ ద్వారా ఆర్థికంగ వృద్ధిని సాధన దిశగా అడుగులు వేస్తున్నాము.

పాలనా వ్యవస్థల్ని ఏకతాటి మీదకు తీసుకువస్తాం.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా నీటి సరఫరా సదుపాయం కల్పించి వాటిపై స్థానిక సంస్థల అజమాయిషీ కల్పించడం. ద్రవ, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేసి సంపద సృష్టించడం ద్వారా ఆదాయాన్ని అందించడం. చిట్టచివరి గ్రామాలను సైతం అనుసంధానిస్తూ ఆయా ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులను తట్టుకునే విధంగా రహదారుల నిర్మాణం చేపట్టడం వంటి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తున్నాము. పై లక్ష్యాల సాధనకు రాష్ట్రంలో ఉన్న 13,371 గ్రామ పంచాయతీలు, 660 మండల పరిషత్ లు, 26 జిల్లా పరిషత్ లకు ఆర్థిక స్వయం ప్రతిపత్తి కల్పించి బలోపేతం చేయాల్సి ఉంది. మా అంచనా మేరకు 2026–2027 నుంచి 2030–2031 వరకు ఆంధ్రప్రదేశ్ లోని స్థానిక సంస్థలకు రూ.62,515 కోట్ల మేర నిధుల లోటు ఉంటుందని భావిస్తున్నాము.

ఈ నెల 25న ఖగోళంలో ఆవిష్కృతం కానున్న మహాద్భుతం

ఈ నెల 25న గగనతలంలో ఓ అందమైన, మహా అద్భుతం ఆవిష్కృతం కానుంది. సౌరకుటుంబంలోని రెండు గ్రహాలు, నెలవంక (చంద్రుడు) సమీపంలోకి రానుండటంతో గగనతలంలో 'స్మైలీ ఫేస్' ఏర్పడనుంది. ఈ మేరకు సైన్స్ వెబ్‌సైట్ 'లైవ్‌సైన్స్' వెల్లడించింది. ఏప్రిల్ 25న తెల్లవారుజాముకు ముందు శుక్రుడు, శని... చందమామ (నెలవంక)కు అతి సమీపంలోకి రానున్నాయి. ఒక దగ్గరే కనిపించనున్న ఆ మూడు... 'స్మైలీ ఫేస్' ఆకృతిని ప్రతిబింబించనున్నాయి. సూర్యోదయానికి ముందు అతి తక్కువ సమయం మాత్రమే కనిపించనున్న ఈ అద్భుత దృశ్యాన్ని ప్రపంచంలో ఎక్కడినుంచైనా వీక్షించేందుకు అవకాశం ఉంది. రెండు గ్రహాలు నయనాలుగా, నెలవంక చిరునవ్వుతో ఉన్న పెదాలుగా కనిపించనుంది. ఈ వివరాలను అమెరికా అంతరిక్ష సంస్థ నాసా సోలార్ సిస్టమ్ అంబాసిడర్ బ్రెండా కల్‌బర్ట్సన్ వెల్లడించారు. శుక్రుడు, శని ప్రకాశవంతంగా ఉండడంతో వాటిని మాములుగా వీక్షించవచ్చు. అయితే, స్మైల్ ఇమేజ్‌ను చూసేందుకు మాత్రం స్టార్‌గేజింగ్ బైనాక్యులర్, టెలిస్కోప్ అవసరం కానున్నాయి.

భారత్ కు ఎఫ్-35 యుద్ధ విమానాలు అందించేందుకు సిద్ధం: జేడీ వాన్స్



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై చర్చల విధివిధానాలు ఖరారయ్యాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రకటించారు. తన భారత పర్యటనలో భాగంగా జైపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీల దార్శనికతను సాకారం చేయడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు. అమెరికా, భారత్ రెండూ అభివృద్ధి చెందాలని ట్రంప్ కోరుకుంటున్నారని వాన్స్ స్పష్టం చేశారు. భారత్‌తో న్యాయమైన వాణిజ్య భాగస్వామ్యాన్ని ట్రంప్ ప్రభుత్వం కోరుకుంటుందని, భాగస్వామ్య దేశాలతో మంచి ఒప్పందాలు చేసుకోవడానికి అమెరికా సిద్ధంగా ఉందని వాన్స్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. భారత్‌కు అమెరికా ఇంధనంతో పాటు, అత్యాధునిక ఎఫ్35 యుద్ధ విమానాలను విక్రయించడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు ఆయన సూచనప్రాయంగా తెలిపారు. సోమవారం రాత్రి ఢిల్లీ నుంచి జైపూర్ చేరుకున్న జేడీ వాన్స్, ఆయన సతీమణి ఉషా వాన్స్, వారి ముగ్గురు పిల్లలు ఇవాన్, వివేక్, మిరాబెల్‌లకు రాజస్థాన్ ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. మంగళవారం ఉదయం వారు చారిత్రక ఆమెర్ కోటను సందర్శించారు. ఈ సందర్భంగా రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, ఉప ముఖ్యమంత్రి దియా కుమారి వారికి స్వాగతం పలికారు. అలంకరించిన ఏనుగులు, రాజస్థానీ సంప్రదాయ నృత్యాలు, కళారూపాలతో వాన్స్ కుటుంబానికి ఆత్మీయ ఆహ్వానం లభించింది. వారి పర్యటన నేపథ్యంలో ఆమెర్ కోటను సందర్శకులకు 24 గంటల పాటు మూసివేశారు. అంతకుముందు ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో జేడీ వాన్స్ విస్తృత స్థాయి చర్చలు జరిపారు. రక్షణ సహకారం, ఇంధనం, ఆధునిక సాంకేతికతలు, వాణిజ్య సంబంధాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ఇరు దేశాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (BTA) చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించడాన్ని ఇరువురు నేతలు స్వాగతించారు. భారత్‌కు తాము భాగస్వాములుగా వచ్చామని, సంబంధాలను బలోపేతం చేసుకోవడమే తమ లక్ష్యమని జైపూర్ ప్రసంగంలో వాన్స్ అన్నారు. "గతంలో కొన్నిసార్లు వాషింగ్టన్ ప్రధాని మోదీకి బోధించే వైఖరితో వ్యవహరించింది. మేము దానికోసం ఇక్కడకు రాలేదు," అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీకి ఉన్న ప్రజాదరణ అమోఘమని, ఆయన రేటింగ్‌లు తనకు అసూయ కలిగించేలా ఉన్నాయని తాను మోదీతో అన్నట్లు వాన్స్ తెలిపారు.

ట్రంప్ హయాంలో వందల వీసాలు రద్దు.. బాధితుల్లో సగం మంది భారత విద్యార్థులే!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ విధానాల కారణంగా అమెరికాలో వందలాది అంతర్జాతీయ విద్యార్థుల విద్యా వీసాలు రద్దయ్యాయి. వీరిలో సగం మంది భారతీయులేనని అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ (ఏఐఎల్ఏ) వెల్లడించింది. అది అందించిన వివరాల ప్రకారం, ఇప్పటివరకు 327 మంది విద్యార్థుల వీసాలు రద్దయ్యాయి. లేదా, వారి స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎస్ఈవీఐఎస్) రికార్డులు తొలగించబడ్డాయి. వీరిలో 50 శాతం మంది భారతీయులే కాగా, 14 శాతం మంది చైనాకు చెందినవారు ఉన్నారు. దక్షిణ కొరియా, నేపాల్, బంగ్లాదేశ్ వంటి దేశాలకు చెందిన విద్యార్థులు కూడా ఈ జాబితాలో ఉన్నారు. ఈ వీసా రద్దులు సమర్థనీయంగా లేవని, వీటిపై పారదర్శకత, పర్యవేక్షణ, బాధ్యత ఉండాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా తప్పుగా తొలగించిన ఎస్ఈవీఐఎస్ రికార్డులపై విద్యార్థులకు అర్జీ వేసుకునే అవకాశాన్ని కల్పించాలని ఏఐఎల్ఏ కోరింది. రాయిటర్స్ నివేదిక ప్రకారం, ఈ వీసా రద్దుల నేపథ్యంలో చాలామంది అంతర్జాతీయ విద్యార్థులు అమెరికాలో కోర్టులను ఆశ్రయించారు. వీసాలు రద్దయిన విద్యార్థులను వారి స్వదేశాలకు పంపించకుండా నిలుపుదల ఆదేశాలివ్వాలంటూ న్యాయమూర్తులను అభ్యర్థించారు. మాసాచుసెట్స్, మోంటానా, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్, వాషింగ్టన్ డీసీ రాష్ట్రాల్లోని న్యాయమూర్తులు అత్యవసరంగా విద్యార్థుల పరిరక్షణకు ఆదేశాలు జారీ చేశారు. వీసా రద్దయిన విద్యార్థుల్లో భారతదేశానికి చెందిన క్రిష్ ఇస్సర్‌దాసాని అనే 21 ఏళ్ల యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్–మెడిసన్‌కి చెందిన అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థి కూడా ఉన్నాడు. నవంబర్‌లో ఓ బార్ నుంచి ఇంటికి వస్తున్న సమయంలో జరిగిన వాగ్వివాదం నేపథ్యంలో అతడిని 'డిసార్డర్‌లీ కండక్ట్' ఆరోపణలపై పోలీసులు అరెస్టు చేశారు. అయితే స్థానిక డిస్ట్రిక్ట్ అటార్నీ అతడిపై కేసు పెట్టనప్పటికీ, ఏప్రిల్ 4న యూనివర్సిటీ అతడి ఎస్ఈవీఐఎస్ రికార్డును రద్దు చేసింది. ఈ చర్య చట్టవిరుద్ధమని విస్కాన్సిన్‌లోని ఫెడరల్ న్యాయమూర్తి స్పష్టం చేశారు.

ఏపీని దోచుకుంటున్నారు... ప్రభుత్వ పెద్దల జేబులు నిండుతున్నాయి: జగన్

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన వైసీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు పెరిగిపోయాయని, వ్యవస్థలను దిగజార్చుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలలో పారదర్శకత లోపించిందని జగన్ విమర్శించారు. విశాఖపట్నంలో సుమారు రూ. 3 వేల కోట్ల విలువైన భూమిని ఎలాంటి గుర్తింపు లేని సంస్థకు కేవలం ఒక్క రూపాయికే కట్టబెట్టారని ఆయన ఆరోపించారు. అదేవిధంగా, లులూ గ్రూపునకు రూ.2,000 కోట్ల విలువైన భూమిని అప్పగించారని మండిపడ్డారు. రాజధాని అమరావతిలో నిర్మాణ పనుల అంచనాలను భారీగా

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : వెనుకబడిన తరగతుల అభ్యున్నతే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని, గతంలో ఎన్నడూ లేనంతగా బీసీల సంక్షేమానికి నిధులు కేటాయించారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఎన్నికల్లో బీసీలకిచ్చిన ప్రతి హామీని నెరవేరేస్తున్నామని, ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బీసీ కులాలకు చెందిన వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి సవిత మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల మేలుకు సీఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన రోజు నుంచి బీసీ కులాల అభ్యున్నతికి నిధులు కేటాయిస్తూ వస్తున్నారన్నారు. 2024-25 బడ్జెట్లో ఏపీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బీసీలకు రూ.39,007 కోట్లు, 2025-26 బడ్జెట్ లో బీసీలకు రూ.48 వేల కోట్లు కేటాయించారన్నారు. ఒకవైపు సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే మరోవైపు అభివృద్ధి పనులను పెద్ద ఎత్తున చేపట్టారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయా కార్పొరేషన్ల చైర్మన్లకు మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులకు అందజేయాల్సిన బాధ్యత మీదేనంటే మంత్రి సవిత స్పష్టంచేశారు.. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారన్నారు. పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచారన్నారు. ఇసుకతో పాటు మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామన్నారు. త్వరలో తల్లికి వందనం, రైతు భరోసా పథకాలను కూడా అమలు చేయబోతున్నామన్నారు. తల్లికి వందనం పథకం కింద ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఏడాదికి రూ.15 వేలు అందజేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందజేయనున్నామన్నారు. చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు రూ.20 వేలు అందజేయబోతున్నామన్నారు. చేనేతలకు అందజేసే పథకాలపైనా నేతన్నలకు వివరించాలన్నారు. బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తున్నామన్నారు. చట్టసభల్లో బీసీలకు 33 శాతం మేర సీట్లు కేటాయింపుపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామన్నారు. నామినేటెడ్, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు పలు సమస్యలను మంత్రి సవిత దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రమందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తన స్థాయిలో సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు. మరికొన్ని సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో కార్పొరేషన్లు కేవలం ప్రకటనలకు, వైసీపీ నాయకులకు రాజకీయ ఉపాధి కల్పనకే పరిమితమయ్యాయన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాకతో బీసీ కార్పొరేషన్లకు పూర్వవైభవం వచ్చిందని మంత్రి సవిత వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నందం అబద్ధయ్య, వీరంకి వెంకట గురుమూర్తి, డూండి రాకేశ్, పి.విజయకుమార్, సదాశివం, ఆర్కే నాయుడు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మంత్రి నాదెండ్ల

ఏలూరు, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తనలోని మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఏలూరు జిల్లా పర్యటనకు వెళుతున్న సమయంలో మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గమనించి, తక్షణమే స్పందించి బాధితులకు సహాయం అందించారు. వివరాల్లోకి వెళితే, మంత్రి నాదెండ్ల మనోహర్ ఏలూరు జిల్లా పర్యటన నిమిత్తం విజయవాడ నుంచి బయలుదేరారు. ఆయన కాన్వాయ్ ఏలూరు సమీపంలోకి చేరుకున్న సమయంలో, రెండు మోటార్ సైకిళ్లు పరస్పరం ఢీకొన్న సంఘటనను ఆయన గమనించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాలతో రోడ్డుపై పడి ఉండటాన్ని చూసిన మంత్రి వెంటనే తన వాహనాన్ని ఆపాలని ఆదేశించారు.క్షణం ఆలస్యం చేయకుండా మంత్రి మనోహర్ ప్రమాద స్థలానికి చేరుకుని, గాయపడిన యువకులకు స్వయంగా ప్రథమ చికిత్స అందించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం, వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, దానిని రప్పించే ఏర్పాట్లు చేశారు. అంబులెన్స్ వచ్చిన తర్వాత, గాయపడిన ఇద్దరు యువకులను మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. అంతటితో ఆగకుండా, మంత్రి మనోహర్ సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఫోన్ ద్వారా సంప్రదించారు. ప్రమాదంలో గాయపడిన యువకులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంత్రి సమయస్ఫూర్తితో స్పందించి చేసిన సహాయం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ రాజు సోలంకి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : కాశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ తెలుగుదేశం ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు రాజు సోలంకి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం వన్ టౌన్ లో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో తెలుగుదేశం నాయకులు, కూటమి నాయకులు పాల్గొని పాకిస్తాన్ కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజు సోలండి మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు సారేపల్లి రాధాకృష్ణ, కోగంటి రామారావు, 37వ డివిజన్ తెలుగుదేశం అధ్యక్షులు పిళ్ళా సుదర్శన్, జై తెలుగుదేశం నాయకులు గణపా రాము, ఎం.తిరుమలేష్, పరిసపోగు రాజేష్, పేరాబత్తుల రమణ, నమ్మి భాను ప్రకాష్, కొంపెల్ల శ్రీనివాస్, ఉప్పూడి రాము, కొనికి కొండయ్య, పట్నాల హరిబాబు,కే. శివశర్మ, చిన్న సుబ్బయ్య, ఆర్. మాధవ, సుఖాసి సరిత, నందకుమారి, మెండి జ్యోతి, బి.శాంతి, ప్రియాహొతదితరులు పాల్గొన్నారు.

వాటికన్ సంప్రదాయానికి భిన్నంగా పోప్ ఫ్రాన్సిస్ చివరి కోరిక

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : క్యాథలిక్ చర్చిల అధినేత పోప్ ఫ్రాన్సిస్ కన్ను మూసిన సంగతి తెలిసిందే. తన అంత్య క్రియలకు సంబంధించి ఆయన కీలకమైన విషయాన్ని వెల్లడించారు. శతాబ్దాలుగా వస్తున్న వాటికన్ సంప్రదాయానికి భిన్నంగా, తన మరణానంతరం భౌతికకాయాన్ని వాటికన్ నగరం వెలుపల రోమ్‌లోని సెయింట్ మేరీ మేజర్ బాసిలికాలో ఖననం చేయాలని తాను కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ నిర్ణయం వెనుక బాసిలికాతో ఆయనకున్న ప్రత్యేక అనుబంధం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. సాధారణంగా, మరణించిన పోప్‌ల భౌతికకాయాలను వాటికన్ నగరంలోని సెయింట్ పీటర్స్ బాసిలికా నేలమాళిగల్లో ఖననం చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, పోప్ ఫ్రాన్సిస్ ఈ సంప్రదాయాన్ని అనుసరించకూడదని నిర్ణయించుకున్నారు. 2023 డిసెంబర్ 12న మెక్సికన్ టెలివిజన్ వార్తా సంస్థ 'ఎన్ఎ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. తన అంత్యక్రియల ఏర్పాట్లను సరళతరం చేయాలనే ఉద్దేశ్యంతో, వాటికి సంబంధించిన విషయాలను ఆర్చ్ బిషప్ డీగో జియోవని రవేలీతో ఇప్పటికే చర్చించినట్లు పోప్ ఫ్రాన్సిస్ పేర్కొన్నారు. రోమ్‌లోని సెయింట్ మేరీ మేజర్ బాసిలికాతో పోప్ ఫ్రాన్సిస్‌కు గాఢమైన అనుబంధం ఉంది. ముఖ్యంగా, ఆ చర్చిలో కొలువైన 'సేలస్ పోపులి రోమని'గా ప్రసిద్ధి చెందిన మేరీమాత, బాల ఏసు చిత్రాన్ని ఆయన ఎంతగానో ఆరాధిస్తారు. పోప్ హోదాలో విదేశీ పర్యటనలకు వెళ్లే ముందు, తిరిగి వచ్చిన తర్వాత ఆయన తప్పకుండా ఈ చిత్రం ముందు ప్రార్థనలు చేస్తుంటారు. ఈ ప్రత్యేక బంధమే తన చివరి విశ్రాంతి స్థలంగా బాసిలికాను ఎంచుకోవడానికి కారణమని తెలుస్తోంది. చారిత్రకంగా చూస్తే, పోప్‌లను వాటికన్ వెలుపల ఖననం చేయడం చాలా అరుదు. 1903లో మరణించిన పోప్ లియో-13 భౌతికకాయాన్ని మాత్రం ఆయన కోరిక మేరకు రోమ్‌లోని సెయింట్ జాన్ లేటరన్ బాసిలికాలో ఖననం చేశారు. ఇక సెయింట్ మేరీ మేజర్ బాసిలికాలో ఇప్పటివరకు ఆరుగురు పోప్‌ల అంత్యక్రియలు జరిగాయి. చివరిసారిగా 1669లో పోప్ క్లెమెంట్-9ను అక్కడ ఖననం చేశారు. సుమారు మూడున్నర శతాబ్దాల తర్వాత, పోప్ ఫ్రాన్సిస్ తన చివరి కోరిక ద్వారా మళ్లీ బాసిలికాకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు.

పల్నాడులో మాజీ మంత్రి విడదల రజనికి చేదు అనుభవం

చిలకలూరిపేట, నేటి పత్రిక ప్రజావార్త : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పల్నాడులో ముస్లింలు చేపట్టిన ర్యాలీకి హాజరైన మాజీ మంత్రి విడదల రజనికి చేదు అనుభవం ఎదురైంది. తమ ర్యాలీని రాజకీయం చేయొద్దని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని ముస్లింలు కోరడంతో చేసేదేమీ లేక రజని వెనుదిరిగారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ ముస్లింలు ర్యాలీ చేపట్టారు. ముస్లింలకు సంఘీభావం తెలుపుతూ మాజీ మంత్రి రజని ఈ ర్యాలీకి హాజరయ్యారు. కళామందిర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ చౌత్రా సెంటర్ వద్దకు రాగానే మాజీ మంత్రి విడదల రజిని అందులోకి ప్రవేశించి కొంతదూరం నడిచారు. అయితే, మాజీ మంత్రి రాకతో శాంతియుతంగా చేపట్టిన తమ ర్యాలీకి రాజకీయ రంగు అంటుతుందని ముస్లింలు ఆందోళన వ్యక్తం చేశారు. తమ ర్యాలీలో పాల్గొన వద్దంటూ ఆమెను అడ్డుకున్నారు. దీంతో ర్యాలీ నుంచి వెళ్లిపోవాల్సిందిగా పోలీసులు ఆమెను కోరారు.అయితే, వక్ఫ్ సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని, రాజకీయ నాయకులు కూడా వాటిలో పాల్గొంటున్నారని చెబుతూ పోలీసులతో రజని వాగ్వాదానికి దిగారు. దీనిపై ర్యాలీ నిర్వాహకులు స్పందిస్తూ.. పార్టీలకతీతంగా ముస్లింలంతా ఈ ర్యాలీలో పాల్గొన్నారని చెప్పారు. అందుకే ఒక పార్టీకి చెందిన మిమ్మల్ని వద్దంటున్నామని రజినికి తెలిపారు. చేసేదేమీ లేక ఆమె వైసీపీ నాయకులతో ర్యాలీ నుంచి దూరంగా వెళ్లి, విలేకరులతో మాట్లాడి వెళ్లిపోయారు.

భూమికి 120 కాంతి సంవత్సరాల దూరంలో జీవం....

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : విశ్వంలో భూమి మాత్రమే జీవానికి ఆవాసమా? లేక సుదూర గ్రహాలపై కూడా జీవం ఉందా? అనే అన్వేషణలో కీలక ముందడుగు పడింది. భూమికి 120 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న K2-18b అనే గ్రహంపై జీవం ఉనికికి బలమైన సంకేతంగా భావించే డైమిథైల్ సల్ఫైడ్ (DMS) అనే అణువును శాస్త్రవేత్తలు గుర్తించారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన భారత సంతతి ఖగోళ భౌతిక శాస్త్రవేత్త డాక్టర్ నిక్కు మధుసూదన్ నేతృత్వంలోని బృందం ప్రతిష్టాత్మక జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ (JWST) సాయంతో ఈ అసాధారణ ఆవిష్కరణ చేసింది. భూమిపై, డైమిథైల్ సల్ఫైడ్ (DMS) ప్రధానంగా సముద్రపు పాచి వంటి సూక్ష్మజీవుల జీవక్రియల ఫలితంగా మాత్రమే ఉత్పత్తి అవుతుంది. గంధకం, కార్బన్, హైడ్రోజన్‌లతో కూడిన ఈ అణువు K2-18b వాతావరణంలో కనుగొనడం, ఆ గ్రహంపై జీవం ఉండే అవకాశాలకు బలమైన సూచికగా పరిగణిస్తున్నారు. ఈ పరిశోధన వివరాలు ప్రముఖ 'ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్' లో ప్రచురితమయ్యాయి. "ఇప్పుడే జీవాన్ని కనుగొన్నామని చెప్పడం తొందరపాటే అవుతుంది" అని డాక్టర్ మధుసూదన్ ఒక సమావేశంలో స్పష్టం చేశారు. "అయితే, మా పరిశీలనలకు అత్యుత్తమ వివరణ ఏమిటంటే, K2-18b వెచ్చని సముద్రంతో నిండి, జీవంతో కళకళలాడుతూ ఉండవచ్చు" అని ఆయన అన్నారు. "ఇది ఒక విప్లవాత్మక క్షణం. మానవాళి నివాసయోగ్యమైన మరో గ్రహంపై జీవ సంకేతాలను చూడటం ఇదే తొలిసారి" అని అభిప్రాయపడ్డారు. K2-18b గ్రహాన్ని 2017లో కనుగొన్నారు. ఇది భూమి కంటే పెద్దదిగా, నెప్ట్యూన్ కంటే చిన్నదిగా ఉండే 'సబ్-నెప్ట్యూన్' తరగతికి చెందిన గ్రహం. ఇది తన నక్షత్రం చుట్టూ జీవానికి అనుకూలమైన దూరంలో పరిభ్రమిస్తోంది. 2021లో డాక్టర్ మధుసూదన్, K2-18b వంటి గ్రహాలు 'హైసియన్' (Hycean) తరగతికి చెంది ఉండవచ్చనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. హైసియన్ గ్రహాలంటే విశాలమైన సముద్రాలు, హైడ్రోజన్ అధికంగా ఉండే వాతావరణం కలిగి, జీవానికి అనుకూల పరిస్థితులు ఉండేవి. 1980లో భారతదేశంలో జన్మించిన డాక్టర్ నిక్కు మధుసూదన్, వారణాసిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ పూర్తి చేశారు. అనంతరం అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (MIT) నుంచి మాస్టర్స్, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. ప్రస్తుతం కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇతర గ్రహాల వాతావరణం, వాటి నిర్మాణం, జీవానికి అనుకూలతపై ఆయన పరిశోధనలు కేంద్రీకృతమై ఉన్నాయి. 'హైసియన్' గ్రహాల భావనను పరిచయం చేసిన వ్యక్తిగా ఆయన ప్రసిద్ధి చెందారు. డాక్టర్ మధుసూదన్ బృందం ఆవిష్కరణ, ఎన్రికో ఫెర్మీ పేరు మీదుగా వచ్చిన 'ఫెర్మీ పారడాక్స్' (Fermi Paradox) పై మళ్లీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇంత విశాల విశ్వంలో జీవానికి అనుకూలమైన గ్రహాలు అనేకం ఉండే అవకాశం ఉంటే, మనకు ఇప్పటి వరకు గ్రహాంతర జీవుల జాడ ఎందుకు తగల్లేదు? అనేదే ఈ పారడాక్స్ సారాంశం. అయితే... K2-18b పై DMS గుర్తింపు ఈ పారడాక్స్‌ను పరిష్కరించనప్పటికీ, విశ్వంలో మనం ఒంటరి కాదనే సమాధానం దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు. జేమ్స్ వెబ్ టెలిస్కోప్ K2-18b పై మరిన్ని పరిశీలనలు జరపనుంది.

ఇంటర్నేషనల్ రివర్స్ బయ్యర్ సెల్లర్ మీట్ (ఆర్బీఎస్ఎమ్) విజయవంతం

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ) మరియు ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ (ఎఫ్ఐఈఓ) సంయుక్తంగా విజయవాడలో ఏప్రిల్ 24 మరియు 25 తేదీల్లో నిర్వహించిన ఇంటర్నేషనల్ రివర్స్ బయ్యర్ సెల్లర్ మీట్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మైక్రో, స్మాల్ & మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈలు)కు విదేశీ కొనుగోలు దారులతో నేరుగా కలవడానికి అవకాశం కల్పించబడింది. మొత్తం 51 అవగాహన ఒప్పందాలు మరియు వ్యాపార ఒప్పందాలు కుదిరాయి, వీటిలో చాలామంది తొలి ప్రయత్నంలో ఉన్న పారిశ్రామికులు మరియు మహిళా పారిశ్రామికులే. ఈ ఆర్బీఎస్ఎమ్ ద్వారా స్థానిక సంస్థలు తమ ఉత్పత్తుల ఎగుమతికి కొత్త మార్గాలు తెరచుకున్నాయి మరియు ప్రపంచ వ్యాప్తంగా వ్యాపార భాగస్వామ్యాలను ప్రోత్సహించింది. వీడియో సదస్సులో పాల్గొన్న జాయింట్ డైరెక్టర్ జనరల్ ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న మార్కెటింగ్ మద్దతుతో పాటు రాష్ట్రంలో ఉన్న విధాన సహకారం, పోర్ట్ ఆధారిత మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలిపే అవకాశం కలదు" అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని 300కు పైగా ఎంఎస్ఎంఈలు తమ ఉత్పత్తులను అగ్రో &ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్ & గార్మెంట్స్, ఇంజనీరింగ్ గూడ్స్, హ్యాండీక్రాఫ్ట్ తదితర విభాగాల్లో ప్రదర్శించాయి. అమెరికా, జపాన్, యూకే, జీసీసీ దేశాలు, ఆఫ్రికా మరియు దక్షిణ ఆసియా దేశాల నుంచి వచ్చిన 25 మంది అంతర్జాతీయ కొనుగోలు దారులు పాల్గొన్నారు. సమాప్తి సమావేశంలో మాట్లాడుతూ ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు పేర్కొనగా, "ఈ ఆర్బీఎస్ఎమ్ విజయం మన ఎంఎస్ఎంఈలు అంతర్జాతీయ మార్కెట్ వైపు దూసుకెళ్లాలనే సంకల్పానికి నిదర్శనం. శిక్షణ, సామర్థ్య అభివృద్ధి, ట్రేడ్ ఫెసిలిటేషన్ వంటి అంశాలలో ప్రభుత్వ మద్దతు ఎప్పటికీ కొనసాగుతుంది." రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈలకు మద్దతుగా MSME-1 పోర్టల్ ప్రారంభించనుంది. ఈ పోర్టల్ ద్వారా ఎంఎస్ఎంఈలకు సంబంధించి అన్ని కమ్యూనికేషన్‌లు, సమస్యలు పరిష్కరించబడతాయి. అలాగే ఒప్పందాలపై ట్రాకింగ్ కోసం ప్రత్యేకంగా మరో పోర్టల్‌ను ప్రారంభించనున్నట్టు కూడా ఆయన వెల్లడించారు.

కీరవాణి, సునీత, చంద్రబోస్ లపై గాయని ప్రవస్తి ఆరాధ్య సంచలన ఆరోపణలు

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రముఖ తెలుగు సంగీత రియాలిటీ షో 'పాడుతా తీయగా' కార్యక్రమ న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్న ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి, గాయని సునీత, గీత రచయిత చంద్రబోస్‌లపై గాయని ప్రవస్తి ఆరాధ్య సంచలన ఆరోపణలు చేశారు. కార్యక్రమంలో తనకు తీవ్ర అన్యాయం జరిగిందని, పక్షపాతం, అవమానాలకు గురయ్యానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'పాడుతా తీయగా' కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ప్రవస్తి ఆరాధ్య ఆరోపించారు. ముఖ్యంగా, కీరవాణి స్వరపరిచిన పాటలు పాడిన వారికే అధిక మార్కులు లభిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ఇది ఇతర పోటీదారుల ప్రతిభను తక్కువ చేసినట్లు అవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. కేవలం కీరవాణి పాటలకే ప్రాధాన్యత ఇవ్వడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. కార్యక్రమం సెట్‌లో తాను తీవ్ర అవమానాలకు గురయ్యానని ప్రవస్తి తెలిపారు. తాను జీవనోపాధి కోసం పెళ్లిళ్లు మరియు ఇతర కార్యక్రమాల్లో పాటలు పాడతానని చెప్పినప్పుడు, దానిని ఎత్తి చూపుతూ న్యాయనిర్ణేతలు తనను కించపరిచారని ఆమె వాపోయారు. అంతేకాకుండా, సెట్‌లో తనను బాడీ షేమింగ్‌కు గురిచేశారని, తన శరీరాకృతిపై వ్యాఖ్యలు చేస్తూ మానసికంగా బాధించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయనిర్ణేతల ప్రవర్తన తనను తీవ్రంగా బాధించిందని ప్రవస్తి అన్నారు. షూటింగ్ సమయంలో తనను ఒక చీడపురుగును చూసినట్లుగా చూశారని, ఎంతో చులకన భావంతో వ్యవహరిం చారని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. తాను తమిళంలో కూడా పలు పాటలు పాడానని, ఎన్నో వేదికలపై ప్రదర్శనలు ఇచ్చానని, కానీ ఎప్పుడూ ఇలాంటి అవమానకరమైన పరిస్థితిని ఎదుర్కోలేదని ఆమె స్పష్టం చేశారు. తెలుగులో ఇలాంటి ప్రతిష్ఠాత్మక వేదికపై ఈ రకమైన అనుభవం ఎదురవడం దురదృష్టకరమని ప్రవస్తి పేర్కొన్నారు.

మంత్రి ఆనం హోమం... వేద పండితులకు ఆర్థిక సాయం

నెల్లూరు, నేటి పత్రిక ప్రజావార్త : ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరులో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యమంత్రి సంక్షేమం కోరుతూ ప్రత్యేక హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన వేద పండితులకు ఆర్థిక సాయం అందించడంతో పాటు, కార్యక్రమానికి హాజరైనవారికి వస్త్రాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా, రాష్ట్రంలో ఆగమ శాస్త్రం అభ్యసించి, వేద పారాయణం చేస్తున్న 599 మంది పండితులను గుర్తించి వారికి ఆర్థిక చేయూతను అందించారు. నెలకు రూ. 3,000 చొప్పున జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన గౌరవ సంభావన (నిరుద్యోగ భృతిగా పేర్కొన్నారు) కింద మొత్తం రూ. 53.91 లక్షల విలువైన చెక్కులను మంత్రి ఆనం పంపిణీ చేశారు. ఈ నిధులను మూడు నెలల కాలానికి కలిపి ఒకేసారి అందించినట్లు తెలుస్తోంది. అనంతరం, హోమం కార్యక్రమానికి హాజరైన సుమారు 8 వేల మంది ప్రజలకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చీరలు, పంచెలు అందజేశారు. వీటితో పాటు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కూడా పంపిణీ చేశారు.

ఏపీ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ-2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసిందని మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. ఈ మేరకు నోటిఫికేషన్ షెడ్యూల్‌ను కూడా ఆయన పంచుకున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని లోకేశ్ పేర్కొన్నారు. దరఖాస్తు పోర్టల్స్ (https://cse.ap.gov.in, https:// apdsc.apcfss.in)తో పాటు సజావుగా దరఖాస్తు ప్రక్రియ కోసం ఒక వీడియోను షేర్ చేశారు. ఈ సందర్భంగా ఆశావహులందరికీ మంత్రి లోకేశ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఇక మెగా డీఎస్సీకి సంబంధించిన పూర్తి సమాచారం, పరీక్షా షెడ్యూల్, సిలబస్, టీచర్ పోస్టుల వివరాలు, సంబంధిత జీఓలు, సహాయ కేంద్రాల వివరాలు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డైరెక్టర్ విజయరామరాజు వెల్లడించారు.

డాక్టర్ల కెరీర్‌ను బలపరచి తీర్చిదిద్దటానికి 'ఐఎస్ఎమ్' ఒక వేదిక...

-విదేశాలలో ఎమ్‌బిబిఎస్ కలలను సాకారం ఐఎస్ఎమ్ ఫోకల్ పాయింట్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : డాక్టర్ల కెరీర్‌ను బలపరచి ఉన్నతమైన స్థానంలో తీర్చిదిద్దే విధంగా ముందుకు తీసుకెళ్లడానికి 'ఐఎస్ఎమ్' వేదికగా దోహదపడుతుందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ముంజేటి రామారావు స్పష్టంచేశారు. గురువారం, మొఘల్‌రాజ్‌పురంలోని అమ్మా కళ్యాణమండపం సమీపంలో నూతన ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ (ఐఎస్ఎమ్) నూతన బ్రాంచ్‌ని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో 10 వరకు కార్యాలయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విదేశాలలో ఎమ్‌బిబిఎస్ కోసం ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ కాలేజ్‌లో చేరి వారి కలలను సాకారం చేసుకోవాలన్నారు. మెడిసిన్ చేయడానికి, ఎఫ్ఎంజి ఎగ్జామ్ సులభతరం చేయటానికి 'ఐఎస్ఎమ్ ఫోకల్ పాయింట్' ఎంతో దోహదపడుతుందన్నారు. ఇంటర్నేషనల్ హ

మూలాలను మరిచిపోకండి - డల్లాస్ విశ్వహిందీ సదస్సులో యార్లగడ్డ

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : దేశమైదేతేనేం మట్టి ఒక్కటే..భాష ఏదైతేనేం మాధుర్యం ఒక్కటేనని తాము ఎక్కడి నుండి ఎదిగామనేది,గుర్తుపెట్టుకోవాలని, మూలాలను మరిచి పోకూడదని విశ్వహింది పరిషత్ జాతీయ అధ్యక్షుడు డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ హిందీ సమితి ఆధ్వర్యంలో సోమవారం డల్లాస్ లో నిర్వహించిన' విశ్వ హిందీ దివస్ 'కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భాష ఒక్కటే మన ఉనికికి గీటురాయి అని ఆయన అన్నారు. అధ్యయనం, అనువాదం, రచన, పఠనం తదితరాదుల ద్వారా భాషతో ఏదో రూపేణా అనుబంధాన్ని కొనసాగించినప్పుడే తల్లివేరుతో దృఢమైన బంధం ఏర్పర్చుకోవచ్చునని వెల్లడించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అగ్గి రాజేస్తున్న త్రిభాషా సూత్రంపై యార్లగడ్డ ప్రసంగించారు. ఒక మాతృభాష, ఒక విదేశీ భాష, ఒక అన్య భారతీయ భాషను అధ్యయనం చేయాలని త్రిభాషా సూత్రం స్పష్టంగా సూచిస్తున్నప్పటికీ దాన్ని జాతిజనులపై హిందీ రుద్దే ప్రక్రియగా చిత్రీకరించడం విచారకరమన్నారు. భాషాధ్యాయనాలపై ప్రతి పౌరిడికి త్రిభాషా సూత్రం పూర్తి స్వేచ్ఛను కల్పించిందని లక్ష్మీప్రసాద్ స్పష్టం చేశారు. గడిచిన 5వేల ఏళ్లలో ఈ భూంపై నడయాడిన అయిదుగురు వ్యక్తులను మానవాళి ప్రేమించి, ఆదరించి, గౌరవించి, పూజించిందని తెలిపారు. శ్రీకృష్ణుడు, యేసుక్రీస్తు, మహమద్ ప్రవక్త, గౌతమ బుద్ధుడు, మహాత్మా గాంధీ ఈ జాబితాలో ఉన్నారని అన్నారు. మహాత్ముని కుమారుడు దేవదాస్ గాంధీ దక్షిణ భారత హిందీ ప్రచార సభ ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో హిందీ భాష్య వ్యాప్తికి ఉత్తర భారతం నుండి వచ్చిన తొలి హిందీ అధ్యాపకుడని తెలిపారు. మద్రాసులో చక్రవర్తి రాజగోపాలాచారి గృహంలో బసచేసి, హిందీ అధ్యాపకులను తయారుచేసిన దేవదాస్ దక్షిణాది రాష్ట్రాల్లో ఆ భాషను వ్యాప్తిచేయడంలో విశేష కృషి చేశారని తెలిపారు. ఆయన కృషి ఫలితంగానే ఉత్తరాది వారి కన్నా కూడా మంచి రచనలు దక్షిణాది నుండి వచ్చిన హిందీ రచయితలు వచ్చారని వెల్లడించారు. మద్రాసు నుండి ప్రచురితమైన చందమామ హిందీ పత్రిక, ఆలూరి భైరాగి వంటి వారి రచనలను ఆయన ఉటంకించారు. భాష అనే వారధిపై ప్రపంచాలు చుట్టి రావచ్చునని తెలిపారు. హిందీ భాష వ్యాప్తికి, అధ్యయనానికి అంతర్జాతీయ హిందీ సమితి డల్లాస్ విభాగాన్ని అభినందించారు. అనంతరం అక్కినేనిపై యార్లగడ్డ హిందీలో రచించిన 'అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ్' పుస్తకాన్ని అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సహకారంతో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షురాలు వీణా శర్మ, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ప్రతినిధులు డా. తోటకూర ప్రసాద్, వెన్నం మురళీ, కల్వల రావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత, జౌళి శాఖ (పరిశ్రమలు, వాణిజ్యం) ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.పి. సిసోడియా



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :: సీనియర్ ఐఏఎస్ అధికారి ఆర్.పి. సిసోడియా రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ (పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాల దృష్టి, పరిపూర్ణ పరిపాలనా అనుభవంతో సిసోడియా నేతృత్వంలో శాఖ అభివృద్ధి దిశగా నడిచే అవకాశం ఉందని నేత కార్మికులు ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతలు చేపట్టే ముందు సిసోడియా ఛాంబర్ లో సంప్రదాయ పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి శాఖకు సంబంధించిన ప్రాధాన్య విషయాలు, అమలులో ఉన్న పథకాలు, భవిష్యత్తు కార్యాచరణల పై సిసోడియాకు సమగ్ర వివరాలు అందించారు. చర్చల సందర్భంగా చేతివృత్తుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, జాతీయ–అంతర్జాతీయ విపణుల్లో చేనేత వస్త్రాలకు ప్రాధాన్యం కల్పించడం వంటి కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి సీఈఓ వీఆర్ విజయరాఘవ నాయక్, చేనేత, జౌళి శాఖ అదనపు డైరెక్టర్లు మురళీకృష్ణ, శ్రీకాంత్ ప్రభాకర్, సంయుక్త డైరెక్టర్లు కన్న బాబు, రాజారావు, ఆప్కో జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, అకౌంట్స్ ఆఫీసర్ పార్వతి పాల్గొన్నారు. ఈ సమావేశం ద్వారా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా నేతృత్వంలో చేనేత జౌళి శాఖ మరింత చురుకుగా ప్రభుత్వ లక్ష్యాల సాధనకు సన్నద్ధమైంది.

చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణ.... : ఉప్పులేటి దేవి ప్రసాద్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్‌లో చేసినటువంటి ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ అశాస్త్రీయంగా ఉందని కేవలం రాజకీయ మైలేజ్ కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ వర్గీకరణను వాడుకున్నాడని, వర్గీకరణ ద్వారా ఎస్సీలు అందరూ కూడా నష్టపోతు న్నారని,మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవి ప్రసాద్ అన్నారు. మాల సంఘాల జేఏసీ కేంద్ర కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పులేటి దేవి ప్రసాద్ మాట్లాడుతూ దేవిందర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్' కేసులో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలోని మెజార్టీ సభ్యులు క్రీమీలేయర్ ఉండాలని తీర్పుల్లో పేర్కొన్నారు. ఆ కేసులో తీర్పు ఆధారంగానే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిషన్ కూడా ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ఉండాలని సిఫార్సు చేసిందని.. కానీ ఈ అంశాన్ని పక్కన ఎట్టి ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమల్లోకి తేవడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు..ముఖ్యంగా మాలలకు అన్యాయం జరిగిందని చంద్రబాబు నాయుడు యొక్క రాజకీయ జీవితాన్ని తూర్పారబట్టారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత మాల సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ గుర్రం రామారావు, మాజీ డీఎస్పీ రవికుమార్, గుంటూరు నగర అధ్యక్షులు నల్లపు నీలాంబరం, బోరగా రత్నం, విప్పర్ల విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల వెంకటేశ్వరరావు గాయకుడే కాకుండా స్వతంత్ర సమరయోధుడు

ఘంటసాలలో హెరిటేజ్ వాక్ ప్రారంభించిన ఎమ్మెల్యే

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఘంటసాల వెంకటేశ్వరరావు సుమధుర గాయకులే కాకుండా స్వతంత్ర సమర యోధులని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం ఘంటసాలలో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. 1967 ఏప్రిల్ 21వ తేదీ మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు ఘంటసాల గ్రామంలో మూడు గంటలపాటు గాన కచేరి చేయగా చల్లపల్లి జమిందారు శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామ ప్రసాద్ బహుద్దురు వారికి గండ పెండేరం తొడిగి, గజారోహణతో సత్కరించి 58 ఏళ్ళు అయిన సందర్భంగా ప్రముఖ ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ గ్రామంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి నివాళులు అర్పించి, గౌతమ బుద్ధుని విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థన చేశారు. గ్రామ ప్రముఖులు, యువీఆర్ గొర్రెపాటి స్కూల్, జడ్పీ హైస్కూల్ విద్యార్థులు చేపట్టిన హెరిటేజ్ వాక్ ను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. అలనాడు ఘంటసాల వెంకటేశ్వరరావు గాన కచేరి చేసిన వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ప్రాంగణాన్ని సందర్శించి, ఆనాడు ఘంటసాల వారు గ్రామంలో బస చేసిన వేములపల్లి వీరశేఖర్ ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల గ్రామానికి వేల సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ఆచార్య నాగార్జునుడు కొన్నేళ్లపాటు ఘంటసాల గ్రామంలో నివసించినట్లు టిబెట్ గ్రంథాల ద్వారా తెలుస్తోందన్నారు. స్వతంత్ర ఉద్యమంలోనూ ఘంటసాల గ్రామానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రాచీన శైవ బౌద్ధ చరిత్రకు నిలయమైన ఘంటసాల గ్రామానికి చెందిన ఘంటసాల వంశీయుల ఇంట జన్మించిన ఘంటసాల వెంకటేశ్వరరావు తెలుగుజాతి హృదయాలను తాకిన గొప్ప గాయకుడు అన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు స్వగ్రామం టేకుపల్లి కాగా, ఆయన జన్మస్థానం చౌటుపల్లి అన్నారు. ఈ విధంగా ఈ ప్రాంతంతో ఘంటసాల వెంకటేశ్వరరావుకు విడదీయలేని అనుబంధం ఉందని, తద్వారా ఘంటసాల వెంకటేశ్వరరావు దివి సీమ ముద్దుబిడ్డ కావడం ఈ ప్రాంత వాసులు అందరూ గర్వించదగ్గ అంశం అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో ఎన్టీఆర్ చేపట్టిన విరాళాల సేకరణ కార్యక్రమంలో ముందుండి ప్రజలను ఉత్తేజిత పరిచేలా పాటలు పాడుతూ సమాజ సేవలో తన వంతు పాత్ర పోషించేవారన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు గాత్ర ప్రతిభను చిన్ననాడే గుర్తించిన చల్లపల్లి రాణి ఉంగరం బహుకరించి బాల భరతుడు అని బిరుదునిచ్చారన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు ఆ ఉంగరాన్ని అమ్మి తద్వారా వచ్చిన డబ్బుతో విజయనగరంలో సంగీత సాధన చేశారని తెలిపారు. తెలుగు భాష పట్ల అమితమైన ప్రేమ కలిగిన ఘంటసాల వెంకటేశ్వరరావు తమిళంలో పాటలు పాడేందుకు అనేక అవకాశాలు వచ్చినా ఏనాడు తమిళంలో పాటలు పాడలేదని తెలిపారు. గాయకునిగానే కాకుండా స్వాతంత్ర పోరాటంలో కూడా ఘంటసాల తనవంతు పాత్ర పోషించారని, 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో ఘంటసాల వెంకటేశ్వరరావు పాల్గొని గుడివాడలో అరెస్టై ఏడాది పాటు జైలులో ఉన్నారన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములుతో కలిసి జైలు జీవితం గడిపిన ఘంటసాల వెంకటేశ్వరరావు పొట్టి శ్రీరాములు మరణంతో ఆవేదన చెంది వారి అంతిమయాత్రలో పాల్గొని దారి పొడవునా దేశభక్తి గీతాలు ఆలపించారని తెలిపారు. అంతటి మహనీయుడు నడయాడిన ఘంటసాల గ్రామంలో వారు నడిచిన ప్రాంతంలో హెరిటేజ్ వాక్ నిర్వహించడం గర్వకారణం అన్నారు. ఇంతటి మహోన్నత వారసత్వ సంపదకు నిలయమైన ఘంటసాల గ్రామాన్ని సందర్శించేందుకు దేశ విదేశాల నుంచి తరలివచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. గత ఐదేళ్లలో గత ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురి చేసిన బౌద్ధ జయంతి కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం ఈ ఏడాది నిర్వహించబోతున్నట్లు తెలిపారు. దీంతోపాటు గ్రామంలో చేపట్టిన శయన బుద్ధ ప్రాజెక్టు అతి త్వరలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ప్రవాస భారతీయులు వేమూరి రాజేష్, గొర్రెపాటి విద్యా ట్రస్ట్ ప్రతినిధి కొండపల్లి రామకృష్ణ, యువీఆర్ గొర్రెపాటి స్కూల్ ప్రిన్సిపాల్ లోయ నాగేశ్వరరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, సీనియర్ నాయకులు బండి పరాత్పరరావు, సర్పంచ్ అంకం మారుతీరావు, ఎంపీటీసీ సిద్ధినేని కుమార్ రాజా, ఏఎంసీ డైరెక్టర్ కోలపల్లి శ్రీ వర్ష, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు కొండవీటి శ్రీనివాసరావు, యార్ల శ్రీకాంత్, నాయకులు ఆవుల ధర్మ వెంకట నరసయ్య, పాండు, జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ వార్తలు

ఒసాకా ఎక్స్‌పోలో తెలంగాణ: పెట్టుబడులకు సీఎం రేవంత్ పిలుపు

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ రాష్ట్రానికి అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం జపాన్‌లో పర్యటిస్తోంది. ప్రతిష్ఠాత్మక ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో 2025లో పాల్గొన్న తొలి భారత రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఎక్స్‌పోలోని భారత పెవిలియన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ తెలంగాణ జోన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఒసాకా ఎక్స్‌పో వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు గల అపార అవకాశాలను వివరించారు. సులభతర పారిశ్రామిక విధానం, స్థిరమైన ప్రభుత్వం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణకు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. "హైదరాబాద్‌కు రండి, మీ ఉత్పత్తులను ఇక్కడ తయారు చేయండి. భారత మార్కెట్‌తో పాటు ప్రపంచ దేశాలకు తెలంగాణను ఉత్పత్తి కేంద్రంగా మార్చుకోండి" అంటూ జపాన్ కంపెనీలను సీఎం సాదరంగా ఆహ్వానించారు. తెలంగాణ, జపాన్ మధ్య చారిత్రక స్నేహ బంధాన్ని బలమైన భాగస్వామ్యంగా మార్చుకుందామని, నూతన ఆవిష్కరణలతో భవిష్యత్తుకు బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సీఎం వివరించారు. హైదరాబాద్‌లో 30,000 ఎకరాల విస్తీర్ణంలో 'ఫ్యూచర్ సిటీ' నిర్మిస్తున్నామని, ఇది పర్యావరణ హితం, ఇంధన సామర్థ్యం, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీకి కేంద్రంగా ఎదుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా జపాన్‌కు చెందిన మరుబెని కార్పొరేషన్‌తో కలిసి ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ చుట్టూ నిర్మిస్తున్న 370 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ఔటర్ రింగ్ రోడ్ మధ్య ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్ పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎగుమతుల కోసం సమీప ఓడరేవుతో అనుసంధానించే డ్రై పోర్టును కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మూసీ నది పునరుజ్జీవనంలో భాగంగా 55 కిలోమీటర్ల మేర అర్బన్ గ్రీన్ వే అభివృద్ధికి టోక్యో, ఒసాకా నగరాల అనుభవాలు స్ఫూర్తినిస్తాయని అభిప్రాయపడ్డారు.మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఐటీ, బయోటెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే తనదైన ముద్ర వేసిందని, ఇప్పుడు ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్ వంటి రంగాల్లోనూ పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ జయేశ్ రంజన్ మాట్లాడుతూ, యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ'ని ఏర్పాటు చేశామని, ఇది ఉపాధి, వ్యాపార అవకాశాలను పెంచుతుందని అన్నారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిగే ఒసాకా ఎక్స్‌పోలో తెలంగాణ పెవిలియన్ ద్వారా రాష్ట్ర సాంస్కృతిక వైభవం, పర్యాటక ఆకర్షణలు, పారిశ్రామిక ప్రగతిని ప్రపంచానికి పరిచయం చేయనున్నారు. ఈ వేదిక ద్వారా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

హైకోర్టులో కేటీఆర్‌కు భారీ ఊరట

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఊరట లభించింది. ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. కాంగ్రెస్ మహిళా నాయకురాలు ఆత్రం సుగుణ ఫిర్యాదు మేరకు 2024 సెప్టెంబర్‌లో ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడుతోందని ఉట్నూరులో జరిగిన ఒక సభలో కేటీఆర్ ఆరోపణలు చేశారు. దేశంలో రాబోయే ఎన్నికల నిధుల కోసం మూసీ ప్రాజెక్టును రిజర్వ్ బ్యాంక్‌లా ఉప యోగించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. కేటీఆర్ చేసిన ఆరోపణలపై ఆత్రం సుగుణ ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగేలా కేటీఆర్ వ్యాఖ్యలు చేశారంటూ ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయిని తగ్గించేలా నిరాధారమైన ఆరోపణలు చేసిన కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కేసును హైకోర్టు తాజాగా కొట్టివేసింది.

త్వరలో ఆర్‌టీసీలో 3,038 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : టీజీఆర్‌టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. అతి త్వరలోనే 3,038 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. వీటిలో డ్రైవర్–2,000, శ్రామిక్స్–743, డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానిక్)–114, డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్)–84, డిపో మేనేజర్/ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్–25, అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్)–23, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్–15, సెక్షన్ ఆఫీసర్ (సివిల్)–11, మెడికల్ ఆఫీసర్ (జనరల్)–07, మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్ట్)–07, అకౌంట్స్ ఆఫీసర్–06 పోస్టులు ఉన్నాయని మంత్రి తెలిపారు.

రూ.లక్షకు చేరువలో బంగారం

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : బంగారం ధర తులం లక్షకు చేరువలో ఉంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలతో బంగారం ధరలు పెరిగిపోతున్నది. కొనుగోలుదారులకు షాక్ ఇస్తున్నది. 24 కేరెట్ల బంగారం మంగళవారం నాటికి లక్ష రూపాయలకు చేరుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.ఔన్స్ ధర 3400 డాలర్లు పలుకుతున్నది. సోమవారం బంగారం షాపులకు గిరాకీ పెరిగింది. 2000 సంవత్సరంలో రూ. 4200 ఉన్న ధర, కేవలం 10 సంవత్సరాల క్రితంరూ. 26,300 ఉన్న బంగారం ధర పీక్ కు చేరింది. రాబోయే రోజుల్లో ఇది రూ.లక్ష 25 వేలకు చేరినా ఆశ్చర్యం లేదు. ఇంత ధర పెరుగుతున్నా డిమాండ్ తగ్గలేదు. డాలర్ విలువ తగ్గడంతో బంగారానికి డిమాండ్ పెరిగింది. బంగారం భారతీయ సంస్కృతిలో ఒక భాగమైపోయింది. అనాది నుంచి బంగారు ఆభరణాల రూపంలో ఉంచుకోవడం భారతీయుల సెంటిమెంట్. అందుకే భారత్ ను రత్నగర్భ అని పిలుస్తారు. భారతీయ మహిళలు బంగారాన్ని తమ శరీరంలో భాగంగా భావిస్తారు. మంగళ సూత్రాల నుంచి శరీరంపై ధరించే ఆభరణాలను బంగారుతో తయారు చేస్తారు. భారతీయ మహిళలు మెడలో కనీసం మంగళ సూత్రం రూపంలో బంగారం ఉంటుంది. అలాగే బంగారం ఉంటే తమకు తమ కుటుంబానికి కష్ట సమయాల్లో బాసటగా ఉంటుందని నమ్ముతారు. భారతీయ మహిళల వద్ద ఉన్న బంగారం ప్రపంచంలో ఎవరి వద్ద లేదనేది లెక్కలు చెబుతున్నాయి. ఇంత బంగారం ఉన్నా అత్యధికంగా భారత్ దిగుమతి చేసుకునే వస్తువు బంగారం కావడం విశేషం.విదేశీ మారక ద్రవ్యం డాలర్లలో బంగారం దిగుమతితో కరిగిపోతున్నదనేది ఒక అధ్యయనం చెబుతున్నది.చంద్రశేఖర్ ప్రధాని గా ఉన్నప్పుడు దేశం ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉండడంతో రిజర్వ్ బ్యాంక్ వద్ద బంగారం తాకట్టు పెట్టారు. తాత్కాలికంగా సమస్యను అధిగమించారు. భారతీయ మహిళలు ప్రతి పండుగ, ప్రతి ఫంక్షన్ లకు కొత్త బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తారు. దేశంలోని మహిళల వద్ద బంగారం 24,000 టన్నులు ఉందని ఒక అంచనా. యూరప్, అమెరికా, ఐఎంఎఫ్ వద్ద ఉన్న బంగారం కన్నా భారత్ లో ఉన్నది ఎక్కువ. అనాది కాలం నుంచి భారతీయులకు ఆభరణాలు మీద మక్కువ ఎక్కువ.ముఖ్యంగా మహిళలకు బంగారంపై ప్రీతి. అనాటి రాజులు తమ ఖజానాలో అత్యధికంగా బంగారాన్ని నిలువ చేసేవారుట. బంగారంతో పాటు రత్నాలు, వజ్రాలు కూడా తమ ఆభరణాలలో అందంగా పొదిగేవారుట. సొంతమైన భారత దేశంలో దేవాలయాలు కూడా చాలా ఉన్నాయి. ప్రతి గుడికి సొంత ఆభరణాల ఖజానా ఉంది.కలియుగ దైవమైన వెంకటేశ్వరునికి ఉన్న ఆభరణాలు లెక్కకు మిక్కిలి ఉన్నాయి. శ్రీకృష్ణ దేవరాయలు కాలం నాటినుంచి స్వామి వారికి ఎంతోమంది ఎన్నో ఆభరణాలు చేయించారు. వాటిలో హారాలు, కిరీటాలు ఉన్నాయి. వాటిలో రత్నాలు పొదిగినవి. ముఖ్యంగా ఏడు కిరీటాలు ఉన్నాయి. వేల కిలోల బంగారు ఆభరణాలు స్వామి కి ఉన్నాయి. వేల టన్నుల బంగారు ఆభరణాల ఖరీదు లక్ష కోట్లు పైగా ఉంటాయని ప్రతీతి.ప్రపంచంలోనే తిరుమల వెంకన్న అత్యంత ధనవంతుడని అంటారు. తిరుమలకు తోడు కేరళలోని తిరువనంతపురం లోని అనంతపద్మనాభస్వామి కి కూడా వెలకట్టలేని ఆభరణాలు ఉన్నాయని చరిత్ర చెబుతున్నది. ఆ ప్రాంత రాజు విలువైన ఆభరణాలు స్వామి కి సమర్పించారు. నేలమాళిగలో ఆరవ నంబరు గదిలో ఆనాటి రాజు సమర్పించిన ఆభరణాలు ఉన్నాయని,వాటిని ప్రభుత్వ ఆధ్వర్యంలో తెరిచారు. ఇలా చెప్పుకుంటూ పోతే భారత్ లోని ప్రతి దేవాలయానికి దాని స్థాయిని బట్టి అక్కడ ఉన్న దేవుని విగ్రహాలకు భక్తులు బంగారు ఆభరణాలు చేయించారు. భారత్లో దేవాలయాల్లో దేవుడి విగ్రహాలతో పాటు దేవాలయాల గోడలకు కూడా బంగారు పూత పూస్తారు. అమృత్ సర్లో సిక్కులకు స్వర్ణదేవాలయం ఉంది. అలాగే తిరుమలలో వెంకటేశ్వరుని గర్భ గుడి ఆనందనిలయం బంగారు తాపడం చేసారు. అలాగే స్వామి బ్రహ్మోత్సవాలలో స్వర్ణ రథంపై ఊరేగుతారు. భారత్లో తమిళనాడులో 28 శాతం బంగారు ఉందని ఒక అంచనా. ప్రపంచ బంగారంలో 11 శాతం భారత్ లో ఉంది. బంగారం ధరలు ఆకాశానికి అంటుతున్నా వ్యాపారం ఏమాత్రం తగ్గడంలేదు.ఏదిఏమైనా బంగారంతో భారతీయులకు ఉన్న సంబంధం విడదీయరానిదని చారిత్రికకాలం నుంచి రుజువులు ఉన్నాయి. భారతీయ సంస్కృతి ఉన్నన్నాళ్లు బంగారానికి ఢోకా లేదన్నది వాస్తవం.ఆధునిక కాలంలో ఫ్యాషన్స్ మారినా బంగారంపై మోజు తగ్గడంలేదు. కొత్త కొత్త ఫ్యాషన్ తో ఆభరణాలు కూడా తయారవుతున్నాయి. ఎంతగా ధర పెరిగినా భారతీయ మహిళకు బంగారంపై మోజు తగ్గదు.

హైకోర్టు ఆదేశాల ధిక్కరణ: హైదరాబాద్ అధికారిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : హైకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించిన హైదరాబాద్‌కు చెందిన ఓ అధికారిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లోని మురికివాడలను కూల్చివేయవద్దని 2013లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సదరు అధికారి ఉల్లంఘించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఈ ఘటనకు సంబంధించి కోర్టు ధిక్కరణ కేసులో జైలులో ఉన్న సదరు అధికారి, తనకు ఉపశమనం కల్పించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మంగళవారం ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ తీవ్ర స్వరంతో స్పందించారు. "కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడానికి ఏకంగా 80 మంది పోలీసులను తీసుకువెళతారా? మీరు ఉద్దేశపూర్వకంగానే కోర్టు ఆదేశాలను ధిక్కరించారా?" అని అధికారిని ఉద్దేశించి ధర్మాసనం ప్రశ్నించింది

నాకు న్యాయం చేయండి...

-జూనియర్ మహిళా న్యాయవాది తుంగల మణిప్రియ

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : జూనియర్ మహిళా న్యాయవాది తుంగల మణిప్రియ తనకు న్యాయం జరగాలని, ఆమె సీనియర్ న్యాయ వాదులు పిట్టల శ్రీనివాసరావు, కొలుసు సౌందర్య మూకుమ్మడిగా జిల్లా కోర్టు భవన ఆవరణలో దాడి చేశారని ఆరోపణ చేశారు. స్థానిక గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2025 ఏప్రిల్ 17వ తారీఖున తనపై సీనియర్ న్యాయవాదులు పిట్టల శ్రీనివాసరావు, కొలుసు సౌందర్య ఇద్దరు కలిసి మూకుమ్మడిగా జిల్లా కోర్టు భవనం ఆవరణలో మూకుమ్మడిగా దాడికి దిగారని ఆరోపణ చేశారు. పిట్టల శ్రీనివాసరావు తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి దుర్భాషలాడుతూ మీ ఆయనకు నీకు గొడవలు జరుగుతున్న నిమిత్తంలో కోర్టులో కేసు నడుస్తుంది కాబట్టి తొందరగా మీ ఆయనకి విడాకులు ఇచ్చి నన్ను పెళ్లి చేసుకోవాల్సిందిగా పలుమార్లు ఒత్తిడి చేస్తూ వస్తున్నారని ఆరోపణ చేశారు. 17వ తేదీన కోర్టు లోంచి బయటకు వస్తుండగా తనపై చెయ్యి వేసుకుని లాగి అసభ్యకరంగా పిట్టల శ్రీనివాసరావు ప్రవర్తించారని తెలిపారు. అప్పుడు ప్రతిఘటిస్తూ ఉన్న సమయంలో సీనియర్ లాయర్ గొలుసు వసుంధర వచ్చి తప్పేముంది సీనియర్ లాయర్ కదా మీ ఆయనకి విడాకులు ఇచ్చి ఈ శ్రీనివాసరావుని పెళ్లి చేసుకో ఒత్తిడి చేస్తూ దుర్భాషలాడి నాపై చేయి చేసు కున్నారని తుంగల మణి ప్రియ తెలిపారు. ఈ విషయమై బార్ అసోసియేషన్ లో కంప్లైంట్ ఇచ్చి కోర్టు ముందు నడిరోడ్డుపై మండుట ఎండలో సాయంత్రం 6 వరకు ధర్నా చేశానని అప్పుడు స్థానిక పోలీసులు వచ్చి స్టేషన్ కొచ్చి కంప్లైంట్ ఇవ్వండి ఎఫ్ఐఆర్ కడతామని చెప్పి నన్ను అక్కడి నుంచి తీసుకు వెళ్లారని తెలిపారు. ఈ విషయంపై నేను స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వడానికి వెళ్తే సబ్ ఇన్స్పెక్టర్ అక్కడున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇది మీ లాయర్లు గొడవ వెళ్లి బార్ అసోసియేషన్ లో తేల్చుకోండి అన్నారని అన్నారు. బార్ అసోసియేషన్ లో కంప్లైంట్ పెడితే స్పందన కలగలేదని ఆమె అన్నారు. నాకు జరిగిన అవమానాన్ని న్యాయమూర్తులు సుమోటోగా తీసుకొని కేసులు దర్యాప్తు చేయవలసిందిగా కోరుతూ తనపై దాడి చేసే వారిని తక్షణమే బార్ అసోసియేషన్ నుంచి తొలగించి వారి లా ప్రాక్టీస్ ని రద్దు పరచవలసిందిగా డిమాండ్ చేస్తూ నాకు న్యాయం జరగాలని కోరారు. రాష్ట్ర హైకోర్టుని దేశ సుప్రీంకోర్టు ని వేడుకున్నారు.

ఆ... మహనీయుడే నాకు స్ఫూర్తి...

: డాక్టర్ హసీమ్ బేగ్

మచిలీపట్నం, నేటి పత్రిక ప్రజావార్త : నవ్యాంధ్ర నిర్మాత, అమరావతి రూపశిల్పి, రాష్ట్రాన్ని పురోగతి వైపు నడిపించడంలో అహర్నిశలు పరుగులు పెడుతూ ఏడుపదుల వయసులో నవ యువకుడిలా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు మచిలీపట్నం 15వ డివిజన్లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తెలుగు యువతఉపాధ్యక్షులు డాక్టర్ హసీమ్ బేగ్ నిరుపేదలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హసీం బేగ్ మాట్లాడుతూ ఏ ఒక్క పేదవాడు ఆకలితో ఉండకూడదు అనే ఉద్దేశ్యముతో రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసి పేదల ఆఖరి తీరుస్తున్న చంద్రబాబు నాయుడు నూరేళ్లు ఆరోగ్యంతో ఉండాలని ప్రతి పేదవాడు కోరుకుంటాడని డాక్టర్ హసీం బేగ్ అన్నారు. గత ప్రభుత్వం పేదలను విస్మరించి నిరుపేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ లను మూసి వేయించాడని తమ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడుతుందని, నిరుపేదల అవసరాన్ని గుర్తించి తీరుస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు పండుగ పురస్కరించుకుని మచిలీపట్నం 15వ డివిజన్లో నిరుపేదలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని డాక్టర్ హసీం బేగ్అన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ నగరంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో డాక్టర్ హసీం బేగ్ ముందు ఉంటారని స్ఫూర్తి ప్రదాత అమరావతి నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న కృషి చాలా గొప్పదని ఆ నాయకుడు పుట్టినరోజు పేదల సమక్షంలో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు లియాస్ పాషా, 48 వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పివి ఫణి కుమార్, గవర్నమెంట్ హాస్పిటల్ మాజీ డైరెక్టర్ అబ్దుల్ అజీమ్, వాడపల్లి మహేష్, వెంకట దాసు, ఎస్.కె అక్బర్, 15వ డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా లిటిల్ బ్రెయిన్స్ స్కూల్ 10వ వార్షికోత్సవం

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విద్యార్థులు చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని, పిల్లల్లో ఉన్న ఆసక్తిని తల్లిదండ్రులు గమనించి వారిని ప్రోత్సహించడం ద్వారా వారు ఆ రంగంలో నిష్ణాతులవుతారని లిటిల్ బ్రెయిన్స్ స్కూల్ డైరెక్టర్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఫణిప్రసాద్ ముక్తేవి చెప్పారు. మంగళవారం స్థానిక సున్నపుబట్టీల సెంటర్ లోని ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ కళ్యాణ మండపం) హాలులో లిటిల్ బ్రెయిన్స్ స్కూల్స్ 10వ వార్షికోత్సవం వేడుకలు (బాల వినోదం అవధులు లేని ఆనందోత్సాహం) నేపథ్యంలో ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఫణి ప్రసాద్ ముక్తేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో నైపుణ్యాలు, సృజనాత్మకత ఉంటాయన్నారు. చిన్నతనం నుంచే పిల్లలు వేటిపై ఆసక్తి చూపుతున్నారో పెద్దలు గమనించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమన్నారు. విద్య అనే సంపదను ఎంత పంచితే అంత పెరుగుతుందన్నారు. అనంతరం ముఖ్యఅతిథి గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతులమీదుగా "ది లిటిల్ క్రానికల్" అనే ప్రగతి సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావిధానం ద్వారా పిల్లల అభివృద్ధి, భవిష్యత్ కు కృషి చేస్తున్న ఫణి ప్రసాద్ ముక్తేవి టీం ను అభినందించారు. ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక రంగంలో ముందుకు వెళ్తున్నామంటే చిన్ననాటి నుండి ఉపాధ్యాయులు నేర్పిన పాఠలేనన్నారు. విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయుల కృషి ఎంతో అభినందనీయమన్నారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సుధా ప్రవీణ, అకడమిక్ డీన్ డి.గిరిశేఖర్, సీనియర్ మేనేజర్ సాయి కృష్ణతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్ర హాస్పిటల్స్ లో సూపర్ స్టార్ మహేష్ బాబు ఎం బి ఫౌండేషన్ సహకారంతో ఉచిత హెచ్ పి వి వాక్సిన్ క్యాంపు

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్ర హాస్పిటల్స్‌లో ఉచిత హెచ్.పి.వి. వాక్సిన్ క్యాంపును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం రోడ్డులోని ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ హాస్పటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రా హాస్పిటల్ పెడియాట్రిక్ స్పెసలిస్ట్,ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ పి.వి.రామారావు, ఫీటల్ మెడిసిన్ స్పెషలిస్ట్, డైరెక్టర్ డాక్టర్ పాతూరి పద్మ మాట్లాడుతూ, హ్యూమన్ పాపిల్లోమా వైరస్ వాక్సిన్, సెర్వికల్ కాన్సర్ రాకుండా నివారించేందుకు ఇచ్చే వాక్సిన్, బాలికలకు మరియు మహిళలకి విజయవాడ ఆంధ్ర హాస్పిటల్స్ లో ఉచితంగా వాక్సిన్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాంపు ప్రముఖ సినీ నటుడు మహేష్‌బాబు ఫౌండేషన్ సహకారంతో ఆంధ్ర హాస్పిటల్స్‌లో తొమ్మిది నుంచి నలభై ఐదు సంవత్సరాల లోపు మహిళలకి మూడు డోసులు చొప్పున ఇస్తామన్నారు. ఒక్కో డోసు ఖరీదు రూ.2వేలు కాగా.. మొత్తానికి ఒక్కొక్కరికి రూ.6వేలు వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. మహేష్ బాబు ఫౌండేషన్ నుంచి అందజేసి రూ.40 లక్షలతో ఈ క్యాంపును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళల్లో వచ్చే కాన్సర్‌లలో సెర్వికల్ కాన్సర్ ముఖ్యమైందని, దానిని నివారించటానికి ఈ వాక్సిన్ ఎంతగానో ఉపయోగపడుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా వ్యాక్సిన్ అవసరమైన పలువురు చిన్నారులు, మహిళలకు డాక్టర్ పి.వి.రామారావు, డాక్టర్ పాతూరి పద్మ పర్యవేక్షణలో ఆసుపత్రి సిబ్బంది వ్యాక్సిన్ వేశారు.

ఇన్నోవేటివ్ సివిల్ ఇంజనీర్స్ సొసైటీకి. గౌరవ కౌన్సిల్ డైరెక్టర్‌గా శ్రీనివాసులు

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ ప్రైవేట్ యూనివర్శిటీస్ ద్వారా ఇన్నోవేటివ్ సివిల్ ఇంజనీర్స్ సొసైటీకి కౌన్సిల్ డైరెక్టర్‌గా డాక్టర్ అందూరి శ్రీనివాసులు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన జూన్ 2019 నుండి ఏపీలోని కృష్ణా జిల్లా, గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.ఆయన 2018లో విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డి డిగ్రీని పొందారు.ఆయనకు మొత్తం 25 సంవత్సరాల బోధనా అనుభవం ఉంది.ఆయన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కాలర్స్, ఇన్ఎస్‌సి ద్వారా "యంగ్ రీసెర్చర్ అవార్డు 2023" అందుకున్నారు.ఆయన AKS ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా 2023లో గ్లోబల్ ఫ్యాకల్టీ అవార్డును కూడా అందుకున్నారు.ఆయన ప్రఖ్యాత SCI, స్కోపస్ మరియు UGC గుర్తింపు పొందిన జర్నల్స్ లో 36 పరిశోధనా పత్రాలను ప్రచురించారు. జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి సమావేశాలలో 19 పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఆయన ఇంఫాల్ లోని బిర్ టికేంద్రజిత్ విశ్వవిద్యాలయంలో Ph.D. రిజిస్టర్డ్ రీసెర్చ్ స్కాలర్ కు మార్గదర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఆయన JNTUK, కాకినాడలో PhD కోసం నమోదు చేసుకున్న ఇద్దరు పరిశోధనా స్కాలర్లకు మార్గదర్శకత్వం వహిస్తున్నారు. ఆయన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (UGC) మంజూరు చేసిన రూ. 3 లక్షల విలువైన మైనర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ను విజయవంతంగా పూర్తి చేశారు. ఆయన వద్ద 2 పేటెంట్ ప్రచురణలు మరియు 1 పేటెంట్ గ్రాంట్ ఉన్నాయి.శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల CE విభాగానికి R20 మరియు R23 నిబంధనలకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఆయన 2019 నుండి శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల అకడమిక్ కౌన్సిల్ సభ్యుడు.ఇన్స్టిట్యూట్ ఫర్ ఇంజనీరింగ్ రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ (IFERP) జర్నల్ నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ రీసెంట్ ఛాలెంజెస్ ఇన్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ICREST 2021)లో ఆయన జాతీయ సలహా కమిటీ సభ్యుడిగా నామినేట్ అయ్యారు. కృష్ణా విశ్వవిద్యాలయం, మచిలీపట్నం, కృష్ణా విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం కోసం అల్యూమినియం విభజనల నిర్మాణాన్ని పర్యవేక్షించడానికి ఆయన సాంకేతిక కమిటీ సభ్యులలో ఒకరిగా కూడా నామినేట్ అయ్యారు.ఆయన "బ్లూ ఐస్ ఇంటెలిజెన్స్ ఇంజనీరింగ్ అండ్ సైన్సెస్ పబ్లికేషన్" మరియు దాని జర్నల్స్ లో ఎడిటోరియల్ బోర్డు సభ్యుడు మరియు "లాటిస్ సైన్స్ పబ్లికేషన్స్" కు ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన వివిధ వృత్తిపరమైన సంస్థలు అంటే ICI, IEI, ISTE, ISRమీ, ISSE మరియు SLT లలో జీవితకాల సభ్యుడు. ఆంధ్రప్రదేశ్ మరియు తమిళనాడు రాష్ట్రాలలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలలలో 14 అతిథి ఉపన్యాసాలు ఇచ్చారు. 25 జాతీయ సమావేశాలు, అధ్యాపక అభివృద్ధి కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాలు, విద్యార్థుల పత్ర పోటీలు, వర్క్‌షాప్‌లు మొదలైన వాటిని నిర్వహించారు.

ఓబీసీ ఉద్యోగులకు రిజర్వేషన్లు కల్పించాలి....

-అంగిరేకుల వరప్రసాద్ యాదవ్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : కేంద్ర ప్రభుత్వం ఓబీసీ, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీనగర్లోని ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ లకు వలే ఓబీసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు ఓబీసి వర్గానికి చెందిన ప్రధాని మోదీ భాద్యత తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఓబీసీ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీదేవి యాదవ్ను నియమిస్తూ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రాష్ట్రంలో 63 ప్రభుత్వ శాఖలలో ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘంను బలోపేతం చేయడం ద్వారా బీసీ ఉద్యమం ను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తానని తెలిపారు. ఓబీసీ, బీసీ ఉద్యోగుల క్రిమిలేయర్ సీలింగ్ పరిమితిని తక్షణమే రూ 11 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుజాన్ సింగ్, విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి జి.మాధవ రావు, డిఆర్ యూసీసీ సభ్యులు క్లాకు బాల నారాయణ, మహిళ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. అంకమ్మ, ఈపిడిసీ ఏపీ కన్వీనర్ గిద్దా శ్రీనివాస నాయుడు తదితరులుహాపాల్గొన్నారు.

హాయిగా నిదురించేందుకు నవతరం నాలుగు రకాల పరుపులు ఆవిష్కరణ

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : మనిషి ఆరోగ్యానికి మంచి నిద్ర చాల అవసరం అందుకోసమే పెప్స్ వినియోగదారుల ఆరోగ్యం శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారికి అనుకూలమైన పరుపులను వారు ప్రశాంతంగా నిదురించుటకు నూతన ఆవిష్కరణలు ప్రవేశపెట్టినది అని పెప్స్ ఇండస్ట్రీస్ సహ-వ్యవస్థాపకులు జి.శంకర్‌రామ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు కొత్త రకాల పరుపుల శ్రేణిని పెప్స్ ఆవిష్కరించినది. పెప్స్ కంఫర్ట్, పెప్స్ సుప్రీం మరియు పెప్స్ రెస్టోనిక్ మెమరీ ఫోమ్ అనే ఉత్పత్తులు ఎంతో సౌకర్యవంతమైనవి మరియు మన్నిక కలిగినవి తెలిపారు. పెప్స్ కంఫర్ట్ చక్కని మన్నిక మరియు కుంగిపోకుండా ఉండేందుకు అత్యుత్తమ స్టీల్ హై కార్బన్, ఆయిల్ రహిత వైర్లుతో యురోపియన్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించబడినవి. ఐరన్-రెసిస్టెంట్ ఫ్లాట్-అల్లిక పాలియస్టర్ ఫాబ్రిక్ మరియు 93% బయోడిగ్రేడబుల్ సామగ్రితో పర్యావరణ అనుకూలమైన నిద్ర పరిష్కారాన్ని అందిస్తుంది. పెప్స్ సుప్రీమ్ ఎలాటి నిద్రాభంగం కలగ కుండా ప్యాకెట్ స్ప్రింగులు కలిగి హాయిగా నిదురించుటకు వీలుగా రూపొం దించారు. భారతీయ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా పెప్స్ ప్రపంచ స్థాయి ఉత్పత్తులను అందించటం తమకు గర్వంగా ఉంది అన్నారు.అమెరికన్ రెస్టోనిక్ గ్రేట్ స్లీప్‌లో భాగంగా, పెప్స్ సానిబెల్ బోన్నెల్ ప్లష్ మెమరీ ఫోమ్ అనేది హైబ్రిడ్ పరుపు, ఇది ఉష్ణోగ్రత మరియు పీడన శక్తిని నియంత్రిస్తుంది. అధిక-కార్బన్ టాటా స్టీల్ బోనెల్ స్ప్రింగ్స్ తోటి సుఖవంతంగా ఉంటుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో పెప్స్ 5 ప్రత్యేకమైన స్టోర్లు మరియు 600 మల్టీ- బ్రాండ్ స్టోర్లను కలిగి తన స్థానాన్ని పటిష్టం చేసుకున్నాది. నూతనంగా ఆవి ష్కరిం చిన ఉత్పత్తులు అన్ని స్టోర్లలో లభిస్తాయి. పెప్స్ ప్రత్యేక వెబ్‌సైట్ : https://pepsindia.comలో కూడ లభిస్తాయని చెప్పారు

సీఎం చంద్రబాబు సేవలను స్ఫూర్తిగా తీసుకుని నిస్వార్థంగా సేవ చేస్తున్నాం...

-నాయకులు స్పందించటం లేదు

-పిఎమ్ కేఎం అధ్యక్షులు పసుపులేటి వెంకట రమణ

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుహాచేస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని టిడిపి పార్టీకి తాము నిస్వార్థంగా ఎటువంటి పదవులు అశించకుండా పలు సేవలు చేస్తూన్నామని అయితే తమకు పార్టీ పెద్దలు తగిన తోడ్పాటు ఇవ్వకపోవటం అవేదన కలిగిస్తుందని పిఎమ్ కేఎం అధ్యక్షులు పసుపులేటి వెంకట రమణ తెలిపారు. సోమవారం గాంధీ నగర్లోని ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు వజ్రోత్సవ వేడుక కార్యక్రమం చేయటం జరిగింది. ఆయన పేరు మీద పుస్తకాలు రాయటం జరిగిందన్నారు. ఇప్పుడు ఉన్న టీడీపీ నాయకులు అందరికంటే నిస్వార్థంగా ఆయన పేరు మీద తాము అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తాము ఎంతో మంది టీడీపీ నాయకులను ఆహ్వానించటం జరిగిందని ఒక్క సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు తప్ప ఏ ఒక్క నాయకుడు కూడా వచ్చి హాజరవ్వలేదు. సహకారం అందించలేదు అన్నారు. తాము ఎవరిని ఒక్క రూపాయి అడగ టం లేదు. టీడీపీ నాయకులు ఒక్కరు కూడా చంద్రన్న వేడుకలకు రాలేదు అంటే మాకు చాలా బాధ కలుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు మీద ధర్మ చక్ర అనే సినిమా చేశాం. ఆయన గొప్పతనం గురించి అందులో వివరంగా ఉంటుందన్నారు. ఈ సినిమా ఆడియో మే 28న కడపలో జరిగే మహానాడులో రిలీజ్ చేస్తాం అన్నారు. అవకాశం లేకపోతే హైదరాబాద్ ఎన్ టి ఆర్ ఘాట్లో రిలీజ్ చేస్తాం అన్నారు. పార్టీ పెద్ద నాయకులు అయిన కొంతమందిని కలసి చంద్రబాబుతో అపాయింట్మెంట్ ఇప్పించమని అడిగామని ఇవ్వలేదు అన్నారు. ఎమ్ ఎల్ ఏ లు ఆయన పేరు మీద వ్యాపారాలు చేసుకుంటు న్నారు తప్ప సేవ చేయటం లేదు. చంద్రబాబు నాయుడు నిజమైన వారసులుగా తామే అని గర్వంగా చెప్పుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నో స్టిక్స్ న్యాచురల్ ఫ్రూట్ అండ్ పాప్స్ పార్లర్ ప్రారంభం

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : గాయత్రీ నగర్ లో విభిన్నమైన నూతన రుచులతో న్యాచురల్ ఫ్రూట్ పాప్స్ & ఐస్ క్రీమ్స్, డిఫరెంట్ ఫ్లేవర్స్ కొత్తదనం కోరుకునే వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నూతన ఉత్పత్తులతో "నో స్టిక్స్ న్యాచురల్ ఫ్రూట్ అండ్ పాప్స్ పార్లర్"ను తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అతిథులుగా పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ విజయవాడ ప్రజలకు ఈ నూతన రుచులను అందించడానికి ముందుకు వచ్చిన గరికపాటి తనయ్ చౌదరికి అభినందనలు తెలియజేస్తున్నా మన్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ భిన్నమైన రుచులతో న్యాచురల్ ఫ్రూట్ పల్ప్ తో తయారైన ఉత్పత్తులను అందుబాటులోకి తేవడం సంతోషంగా ఉందన్నారు. యువ వ్యాపారవేత్తలు గరికపాటి తనయ్ చౌదరికి, పొన్నగంటి రవికుమార్, బొబ్బ శ్రీకాంత్ రెడ్డి ల వ్యాపారం అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నానన్నారు. డిస్టిక్ మాస్టర్ ఫ్రాంచైజీ తనయ్ చౌదరి, ఏపీ, తెలంగాణ రీజనల్ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ నో స్టిక్స్ ఉత్పత్తులు నాచురల్ ఫ్రూట్ పల్ప్ తో ఎటువంటి రసాయనాలు లేకుండా అవకాడో, జాక్ ఫ్రూట్,వాటర్ మెలన్,టెండర్ కోకోనట్, చిల్లిగువ, స్పానిష్ డిలైట్, మోజీటో మరెన్నో రకాల ఐస్ ఫ్రూట్స్, ఐస్ క్రీమ్స్ ఫ్యామిలీ ప్యాక్స్ వివిధ రకాల సైజులలో అందుబాటులో ఉన్నాయన్నారు. పార్లర్ కు ప్రారంభోత్సవం చేసి మమ్మల్ని ఆశీర్వదించిన ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు, యార్లగడ్డ వెంకట్రావుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గరికపాటి తనయ్ చౌదరి, పొన్నగంటి రవికుమార్, బొబ్బ శ్రీకాంత్ రెడ్డి, గరికపాటి గణేష్, గరికపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నగరంలో ప్రముఖ సినీ హీరోయిన్ కీర్తి సురేష్ సందడి

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : వస్త్ర రంగంలో విశేష ప్రాచుర్యం పొందిన ఆర్ఎస్ బ్రదర్స్ విజయవాడలో రెండవ షోరూమ్ ఏర్పాటుచేసింది. బీసెంట్ రోడ్ క్రాస్ వద్ద ఏర్పాటైన ఈ అధునాతన షోరూమ్‌ను ప్రముఖ సినీ హీరోయిన్ కీర్తి సురేష్ లాంచనంగా ప్రారంభించారు. అనంతరం ఆమె షోరూమ్ అంతా కలయదిరిగి వైవిధ్య భరితమైన వస్త్ర శ్రేణిని సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్ఎస్ బ్రదర్స్ 14వ షోరూం, విజయవాడలో రెండవ షోరూమ్ను ప్రారంభించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రానున్న వివాహాది శుభకార్యాలకు అవసరమైన అన్ని రకాల పట్టుచీరలు, ఫ్యాన్సీ చీరలు వైవిధ్య భరితమైన వస్త్రాలు ఉన్నాయని విజయ వాడ పరిసర ప్రాంత ప్రజలంతా ఈ షోరూం సందర్శించి వస్త్రాలను కొను గోలు చేయాలని ఆమె సూచించారు. అనంతరం ఆర్ఎస్ బ్రదర్స్ తరపున పి.వెంకటేశ్వర్లు, ఎస్.రాజమౌళి, పి.ప్రసాదరావు మాట్లాడుతూ సినీనటి కీర్తి సురేష్ తన షోరూమ్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉంద న్నారు. అన్నిరకాల వస్త్రాలు అందుబాటు ధరల్లో తమ షోరూంలో లభ్యమవు తాయని తెలిపారు. ఖాతాదారుల అభిరుచులను అనుగుణంగా అన్ని రకాల పట్టుచీరలతో పాటు స్పెషల్ కలెక్షన్, ఆధునిక వస్త్రాలు, బ్రాండెడ్ మెన్స్ వేర్ తమ షోరూంలో అందుబాటులో ఉన్నాయని, కుటుంబ సమేతంగా షాపింగ్ చేయాలనుకునే వారికి అవసరమైన అన్ని రకాల వస్త్రాలు అందుబాటు ధరల్లో లభ్యమవుతాయని వివరించారు. తొలుత ముఖ్యఅతిథు లుగా ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవినాయుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి, యువనాయకుడు బొండా సిద్దార్థ కూడా పాల్గొన్నారు. ముందుగా ఎంపి కేశినేని, ఎమ్మెల్యే బొండా జ్యోతి ప్రజ్వలన చేసి ఆర్.ఎస్.బ్రదర్స్ యజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. విజయ వాడలో ఇలాంటి షో రూమ్ లు మరిన్ని రావడం వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆకాంక్షించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ